## మాధవీనగర్‌ సమస్యలు పరిష్కరిస్తా

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ


ఎమ్మెల్యే గాంధీని కలిసి సమస్యలు వివరిస్తున్న కాలనీ వాసులు

ఆల్విన్‌కాలనీ: డివిజన్‌ పరిధిలోని మాధవీనగర్‌ కాలనీ వాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. ఆదివారం కాలనీ వాసులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో కాలనీలో పర్యటించి అసంపూర్తి పనులను పూర్తి చేస్తానన్నారు. సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. మంచినీటి సరఫరాలో అంతరాయం లేకుండా మెరుగైన మంచినీటి సరఫరా చేయాలని, అవసరమున్న చోట మంచినీటి సరఫరా సమయం పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మధుసూదన్‌రెడ్డి, రఘు కుమార్‌, చిన్నారెడ్డి, కార్తిక్‌, అనిల్‌ కుమార్‌, రాంమోహన్‌రావు, మురళి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్‌ సిబ్బందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బాలానగర్‌ జోన్‌ డీసీపీ సురేష్‌

మూసాపేట: కూకట్‌పల్లి రాందేవ్‌రావు హాస్పిటల్‌లో బాలానగర్‌ పోలీస్‌ డివిజన్‌ పరిధిలోని ఎనిమిది పోలీస్‌ స్టేషన్ల సిబ్బందికి ఆదివారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్ని బాలానగర్‌ జోన్‌ డీసీపీ సురేష్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలోని అన్ని వర్గాలకు వైద్య సేవలను అందించడంలో రాందేవ్‌ రావ్‌ హాస్పిటల్‌ ముందుంటుందని పేర్కొన్నారు. అల్లాపూర్‌, సనత్‌నగర్‌, బాలానగర్‌, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, జీడిమెట్ల, బాచుపల్లి, జగద్గిరిగుట్టలకు చెందిన కానిస్టేబుల్స్‌, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షలు, బోన్‌ మినరల్‌ డెన్సిటీ, బీఎంఐ, న్యూట్రిషనల్‌ అసెస్మెంట్‌ వంటి పరీక్షలతో పాటు సాధారణ పరీక్షలు కూడా నిర్వహించారు. హాస్పిటల్‌ మెడికల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కమలాకర్‌ను పోలీస్‌ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో హాస్పిటల్‌ సీఈఓ డాక్టర్‌ యోబు, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాస్‌రావు, బాలానగర్‌ ఏసీపీ హనుమంతరావు, నిర్వాహకులు విక్రమ్‌దేవ్‌రావ్‌, మీరారావ్‌, అపర్ణరావ్‌, ప్రశాంత్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు, ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆకర్షిస్తున్న సిల్క్‌ ఇండియా వస్త్ర ప్రదర్శన



సిల్క్‌ ఇండియా వస్త్ర ప్రదర్శనలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న మహిళలు

మూసాపేట: పండుగలు, వివాహాల సందర్భంగా మాదాపూర్‌ శిల్పకళా వేదికలో సిల్క్‌ ఇండియా వస్త్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఒడిశా ఆర్ట్స్‌ అండ్‌ క్రాఫ్ట్స్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత కళాకారులు, డిజైనర్లు రూపొందించిన వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు మానస్‌ ఆచార్య తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనలో సిల్క్‌ ఫ్యాబ్రిక్‌తో తయారు చేసిన అనేక రకాల చీరలు, దుస్తులు కూడా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన బంకర్‌ క్రాఫ్ట్‌ చీరలు, కంత స్టిచ్‌ సిల్క్‌ చీరలు, బేలు చీర, పశ్చిమ బెంగాల్‌కు చెందిన టాంగైల్‌, లక్నో చికాన్‌ వర్క్‌, బనారస్‌ సిల్క్‌ జమ్దానీ సిల్క్‌ చీరలు, పిఫాన్‌లతో సహా భారతదేశం నలుమూలల నుంచి కళాకారులు, హస్త కళాకారులతో తయారు చేయబడిన చీరలను ప్రదర్శించారు. రాజస్థాన్‌, గత్వాడా నుంచి బంధేజ్‌, బ్లాక్‌, సంగనేరి ప్రింట్‌, గుజరాత్‌ నుంచి బంధిని, పటోలా, ఖాదీ సిల్క్‌ టస్సార్‌ సిల్క్‌ వంటి వాటిని ఒకే చోట ప్రదర్శిస్తున్నామని తెలిపారు. అదే విధంగా ధర్మవరం స్టైల్‌లో నేసిన సూట్లు, బంగారు జరీ అంచుల చీరలు, ఆంధ్రప్రదేశ్‌, గద్వాల్‌ చీరలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయన్నారు. ఈ ప్రదర్శన ఈ నెల 28 వరకు ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు. అన్ని డెబిట్‌, క్రెడిట్‌ కార్డుల సౌకర్యం ఉందని తెలిపారు.

## ‘మనూ’లో విద్యార్థులు అంతరాయం కల్పిస్తే ఆన్‌లైన్‌ బోధన

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో పరిస్థితిని సమీక్షించడానికి యూనివర్సిటీ ఉన్నతాధికారులతో వైస్‌చాన్స్‌లర్‌ ప్రొఫెసర్‌ సయ్యద్‌ ఐనుల్‌ హసన్‌ సమావేశమయ్యారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ఆదివారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యంగా విద్యార్థులు తరగతులు బహిష్కరించి ఆందోళనలు చేస్తే అందుకు తగిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించారు. క్యాంపస్‌లో చక్కటి వాతావరణానికి అంతరాయం కల్పిస్తే క్యాంపస్‌లోని వసతి గృహాలను మూసి వేసి, విద్యార్థులు వాటిని ఖాళీ చేయించాల్సి వస్తుందని వారు స్పష్టం చేశారు. మిగిలిన సెమిస్టర్‌ తరగతులను ఎవరికీ ఇబ్బంది కలుగకుండా తరగతులను ఆన్‌లైన్‌ ద్వారా నిర్వహించాలని సమావేశంలో నిర్ణయించారు. కొందరు కావాలని తరగతులు జరుగకుండా అంతరాయం కల్పిస్తున్నారని, దీన్ని ఎంత మాత్రం సహించేది లేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశామని, ఆ కమిటీకి తమ సమస్యలను వివరించేందుకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇలాంటిది కాదంటూ అశాంతి వాతావరణం సృష్టించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే సహించబోన్నారు.

## ‘హానర్‌ వివాంటీస్‌’కు ఔత్సాహిక సొసైటీ అవార్డు



అవార్డును స్వీకరిస్తున్న హానర్‌ వివాంటీస్‌ సొసైటీ ప్రతినిధులు

రాయదుర్గం: ఇటీవల నిర్వహించిన గణేష్‌ ఉత్సవాల్లో గోపన్‌పల్లిలోని హానర్‌ వివాంటీస్‌ కమ్యూనిటీ అసోసియేషన్‌కు ‘హానర్‌ వివాంటీస్‌’కు ఔత్సాహిక సొసైటీ అవార్డు దక్కింది. గణేష్‌ ఉత్సవ సమితి–2024లో భాగంగా కమ్యూనిటీ పర్యావరణ అనుకూల గణనాథుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం, వివిధ రకాల మహా ప్రసాద వితరణ, భక్తిశ్రద్ధలతో వినాయకుడికి వీడ్కోలు పలకడం వంటి వాటిని పరిగణనలోకి తీసుకొని గ్రేట్‌ గణేష్‌ అవార్డు–2024 సీజన్‌–5 తెలంగాణ ప్రభుత్వ సమన్వయంతో లయన్స్‌క్లబ్‌ ఇంటర్నేషనల్‌, భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఈ అవార్డులను అందించారు. హానర్‌ వివాంటీస్‌ కమ్యూనిటీ అసోసియేషన్‌ నుంచి శ్రీనివాస్‌ బాల, రాహుల్‌ వెంకట్‌, వెంకట్‌ అంబటి, పూజాత్యాగి అవార్డును స్వీకరించారు.

## అలరించిన ‘శ్రీ కల్యాణం నృత్యరూపకం’




మాదాపూర్‌: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం మహతి కళాసమితి గురువు చంద్రశేఖర్‌ శిష్యబృందం శ్రీ కల్యాణం నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. తాళ్లపాక అన్నమాచార్య సంకేతనాలను నృత్యరూపకంగా ప్రదర్శించి అలరించారు. వకుళ మాత, ఎరుకల సాని, ఆకాశరాజు, పద్మావతి, శ్రీనివాసుల కల్యాణం ఘట్టాలను కళాకారులు సౌమ్య, నారాయణమూర్తి, అక్షిత, పవిత్ర, శ్రావణి, సహస్ర, మనస్విని, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## గర్భిణులు, చిన్నారుల్లో..
# రక్తహీనత నివారణే లక్ష్యంగా..

పౌష్టికాహార లోపంపై నాలుగు థీమ్‌లుగా అవగాహన

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

స్లమ్స్‌, బస్తీలు, వెనుకబడిన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు




సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో పౌష్టికాహార లోపంతో గర్భిణులు, చిన్నారులు రక్త హీనత సమస్యను ఎదుర్కొంటున్నారు. అంగన్‌వాడీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా.. సమస్య తీరడం లేదు. ఈ నేపథ్యంలోనే ఐసీడీఎస్‌ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు పోషణపై కార్యక్రమాలు చేపడుతున్నారు. 30 రోజుల పాటు నిర్వహిస్తున్న పోషణ కార్యక్రమాన్ని నాలుగు థీమ్‌లుగా చేపడుతున్నారు. వారానికి ఒక థీమ్‌ చొప్పున నాలుగు థీమ్‌లతో అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు గ్రోత్‌ మానిటరింగ్‌, పోషణ్‌ భీ పఢాయ్‌ బీ, రక్తహీనత, యుక్త వయస్సు, గర్భధారణ, పరిశుభ్రతపై 793 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బస్తీలు, స్లమ్స్‌, వెనుకబడిన ప్రాంతాల్లో విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టారు. ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణ, భద్రత తదితర అంశాల ఆధారంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోషకాహారం తీసుకునేలా ప్రేరేపించడం, పిల్లల పెరుగుదల పర్యవేక్షణ, మహిళల ఆరోగ్యం, బాలలకు పోషణతో పాటు చదువు తదితర అంశాలను ఈ నెల 30 వరకు విజయవంతంగా కొనసాగేలా పక్బందీగా చర్యలు తీసుకుంటున్నారు.

### 793 కేంద్రాల్లోని..

మేడ్చల్‌ – మల్కాజిగిరి జిల్లాలోని మూడు ఐసీడీఎస్‌ ప్రాజెక్టుల పరిధిలో 793 అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. వీటిలో 68,918 మందికి పైగా చిన్నారులు నమోదవ్వగా.. రోజూ వారికి 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల పప్పు, 0.5 గ్రాముల ఆయిల్‌, 50 గ్రాముల గుడ్డు, 20 గ్రాముల మురుకులు, 50 గ్రాముల బాలామృతం అందజేస్తున్నారు. 9, 972 మంది గర్భిణులు, బాలింతలకు సైతం ప్రత్యేక ఆహారం ఇస్తున్నారు. ఇటీవల నిర్వహించిన గ్రోత్‌ మానిటరింగ్‌ సర్వే ప్రకారం 3,649 మంది చిన్నారులు వారి వయస్సు కంటే తక్కువ ఎత్తు, బరువున్నారు. 961 మంది పిల్లలు అతి తక్కువ ఎత్తు, బరువున్నట్లుగా గుర్తించారు. గర్భిణులను కూడా రక్తహీనత వెంటాడుతోంది. దీని కారణంగా ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు జరగడం లేదని వైద్య సిబ్బంది చెబుతున్నారు.

### పకడ్బందీగా నిర్వహించేలా ప్రణాళికలు

జిల్లా వ్యాప్తంగా పోషణ కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించేలా కార్యాచరణ, ప్రణాళిక రూపొందించి నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి తెలిపారు. పోషకాహార లోపం నివారణే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## నేటి నుంచి 28 వరకు మెగా లోక్‌ అదాలత్‌

గచ్చిబౌలి: మెగా లోక్‌ అదాలత్‌ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 23 నుంచి 28వ తేదీ వరకు ఈ మెగా లోక్‌ అదాలత్‌ నిర్వహిస్తారు. ఈ లోక్‌ అదాలత్‌లో డ్రంకన్‌ డ్రైవ్‌ కేసు, డ్రైవింగ్‌ లైసెన్స్‌ కేసు క్లియర్‌ చేసుకోవాలని గచ్చిబౌలి ట్రాఫిక్‌ పోలీసులు సూచించారు. డాక్యుమెంట్లు రెండు సెట్ల ఆధార్‌ జిరాక్స్‌ పత్రాలు సమర్పించి కేసు కోసం హాజరై పరిష్కరించుకోవాలని వారు సూచించారు. మరిన్ని వివరాలకు కోర్టు పీసీ బాబురావు ఫోన్‌ నెంబర్‌ 9676765480లో సంప్రదించాలి.

## కుట్టు మిషన్ల పంపిణీ



చందానగర్‌: చందానగర్‌లోని హోప్‌ ఫౌండేషన్‌ కార్యాలయంలో ఆదివారం పేద మహిళలకు కుట్టు మిషన్‌లను హోప్‌ ఫౌండేషన్‌ చైర్మన్‌ కొండ విజయ్‌ కుమార్‌ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మహిళలు స్వయం ఉపాధిపై దృష్టి సారించాలన్నారు. హుడా కాలనీ ప్రాంతంలో నివాసముంటున్న వాచ్‌మెన్‌ వృత్తులు నిర్వహిస్తున్న మూడు కుటుంబాలకు కుట్టు మిషన్‌లను అందజేయడం జరిగిందన్నారు. తమ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలకు కుట్టు మిషన్‌లను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్‌ సభ్యులు పాల్గొన్నారు.

## సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

ఎమ్మెల్యే వివేకానంద్‌

కుత్బుల్లాపూర్‌: బతుకమ్మ వేడుకలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. నిజాంపేట్‌ కార్పొరేషన్‌ శ్రీనివాస్‌నగర్‌కు చెందిన ‘స్ఫూర్తి ఉమెన్‌ గ్రూప్‌’ ఆధ్వర్యంలో ప్రతీయేటా నిర్వహించే బతుకమ్మ వేడుకల పోస్టర్‌ను ఆదివారం నిజాంపేట్‌ కార్పొరేటర్‌ రాఘవేందర్‌రావుతో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వివేకానంద్‌ మాట్లాడుతూ పువ్వులలో అమ్మవారిని చూస్తూ మహిళలంతా ఐకమత్యంగా ఆటలాడుతూ అమ్మవారిని కొలుస్తూ ఆడిపాడే వేడుక బతుకమ్మ అని అన్నారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి ఉమెన్‌ గ్రూప్‌ అధ్యక్షురాలు కొడారి రమాదేవి, ఉమాదేవి, శివకుమారి, గీత, పల్లవి, రమాదేవి, మంజుల, యశస్విని, రాజేశ్వరి, చందు, లక్ష్మి, భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు వినతి**

దుండిగల్‌ మున్సిపాలిటీ డీ పోచంపల్లికి చెందిన డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల లబ్ధిదారులు కౌన్సిలర్‌ నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఇప్పటికే ప్లాట్లు మంజూరైన వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. డబుల్‌ బెడ్‌ రూమ్‌ ఇళ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు నవీన్‌, ప్రధాన కార్యదర్శి వినోద్‌ నాయక్‌, ఉపాధ్యక్షుడు భాస్కర్‌ గౌడ్‌ తదితరులు ఉన్నారు.

## ఘనంగా మిలాద్‌ ఉన్‌ నబీ వేడుకలు


కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్‌ తదితరులు

కూకట్‌పల్లి: మిలాద్‌ ఉన్‌ నబీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కూకట్‌పల్లి ముస్లిం యూత్‌ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీ బస్టాండ్‌ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌ ముఖ్య అతిథిగా హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అందరి పండుగలు ఒకే సారి వచ్చినా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. అదే విధంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కాంగ్రెస్‌ నాయకుడు శేరి సతీష్‌రెడ్డి ప్రారంభించారు. 2 వేల మందికి అన్నదానం చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గాలి బాలాజీ, ఎల్‌ రాజా, డివిజన్‌ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ అరవింద్‌ రెడ్డి, మగ్దూం, రంగస్వామి, లక్ష్మయ్య, ప్రసన్నకుమార్‌, అస్లాం, శివచౌదరి పాల్గొన్నారు.

## రామాయణం చదివితే మానసిక ప్రశాంతత


సూర్యనారాయణ శర్మ దంపతులను సన్మానిస్తున్న సీనియర్‌ సిటిజన్స్‌ సభ్యులు

మోతీనగర్‌: నిత్యం భగవద్గీత, రామాయణం చదివితే మానసిక ప్రశాంతత లభిస్తుందని మోతీనగర్‌ సీనియర్‌ సిటిజన్స్‌ కౌన్సిలింగ్‌ అధ్యక్షుడు డాక్టర్‌ ఎస్‌వీ ప్రసాద్‌ అన్నారు. ప్రతి ఆదివారం విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్న వేద పండితులు వద్లమాని సూర్యనారాయణ శర్మ దంపతులను మోతీనగర్‌ సీనియర్‌ సిటిజన్స్‌ కౌన్సిలింగ్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఆయన నివాసంలో సన్మానించి నూతన వస్త్రాలను అందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించే విధంగా కృషి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో బిజ్జ మళ్ల నాగేశ్వరరావు, బ్రహ్మానందారెడ్డి, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో విద్యార్థుల మధ్య స్నేహ సంబంధాలు


టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సత్యనారాయణ

నిజాంపేట్‌: క్రీడలు విద్యార్థుల్లో గెలవాలనే పట్టుదలను పెంచడంతో పాటు స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని బాలానగర్‌ డిప్యూటీ పోలీస్‌ కమిషనర్‌ సత్యనారాయణ అన్నారు. ఆదివారం బాచుపల్లిలోని వీఆర్‌ఎస్‌ విజ్ఞాన జ్యోతి స్కూల్‌లో సీబీఎస్‌ఈ ఖోఖో టోర్నమెంట్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 200 సీబీఎస్‌ఈ పాఠశాలల నుంచి సుమారు 5,500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాలురు, బాలికల అండర్‌–14, అండర్‌–17, అండర్‌–19 విభాగాల్లో పోటీ పడనున్నారు. ఈ నెల 25 వరకు ఈ టోర్నమెంట్‌ జరుగనుంది. ఈ సందర్భంగా ఖోఖో టోర్నమెంట్‌ క్లస్టర్‌ను డిప్యూటీ కమిషనర్‌ సత్యనారాయణ, అసిస్టెంట్‌ పోలీస్‌ కమిషనర్‌ హన్మంతరావు, ఆసియా ఖోఖో బంగారు పతాక విజేత ప్రమోద్‌ థోరాట్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఆటల్లో గెలుపోటములు సహజమని, క్రీడాస్ఫూర్తితో విద్యార్థులు పోటీ పడాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌, ఒలింపిక్‌ టార్చ్‌ కార్యక్రమాలు హైలెట్‌గా నిలిచాయి. ఈ కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి ట్రస్టీ సభ్యులు వల్లూరుపల్లి రాజా రామమోహన్‌రావు, వల్లూరుపల్లి రాజశేఖర్‌, డాక్టర్‌ వల్లూరుపల్లి గీత, వల్లూరుపల్లి రాజ్‌కుమార్‌, వల్లూరుపల్లి రమణ, పాఠశాల డైరెక్టర్‌ కొడాలి విజయరాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన


పరీక్షలు చేస్తున్న వైద్యులు

మియాపూర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని దీప్తిశ్రీనగర్‌ పార్కులో గల హెల్త్‌ కేర్‌ సెంటర్‌లో ఒమేగా ఆసుపత్రి, గచ్చిబౌలి వారి సౌజన్యంతో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం కొనసాగింది. శిబిరంలో ఎత్తు, బరువు, కంటి, దంత, రక్తపోటు, షుగర్‌, పల్స్‌, ఈసీజీ, 2డీ ఏకోతో పాటు మహిళలకు ప్యాప్స్‌మియర్‌, మామోగ్రఫీ మొదలగు కేన్సర్‌ స్క్రీనింగ్‌ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్‌ నిహాలా షరీన్‌, సాయి తేజ, అనూష, ప్రసాదరెడ్డి, కాలనీ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ నాయకులు సీతారామయ్య, సుమన్‌ రెడ్డి, సురేష్‌, శేఖర్‌, ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ సభ్యులు జనార్దన్‌, వాణి, సాంబశివరావు, చౌదరి, మల్లేశ్వరి, పూర్ణచంద్రరావు, ఆసుపత్రి ప్రతినిధులు అనురాగ్‌, వెంకటేష్‌, కౌండిన్యశ్రీ, వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఎమ్మెల్యే పర్యటన

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ అవంతినగర్‌ ఈస్ట్‌ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిశీలించడానికి సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు విద్యుత్‌ శాఖ అధికారులతో కలిసి పర్యటించనున్నారు. కాలనీలో కొన్ని రోజుల నుంచి లో ప్రెషర్‌ కారణంగా సరిపడా తాగునీరు సరఫరా కావడం లేదు. అదే విధంగా పురాతనమైన డ్రైనేజీ పైపులైన్‌ల స్థానంలో నూతన డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో పాటు విజేత స్కూల్‌ వెనుక రోడ్డులో నిర్మాణ పనులు చేపట్టే విధంగా చర్యలు చేపట్టేందుకు ఎమ్మెల్యే పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్‌ డివిజన్‌ ప్రధాన కార్యదర్శి తన్నీరు తిరుపతి రావు తెలిపారు.

## దేవి నవరాత్రోత్సవాలపై సమావేశం

మోతీనగర్‌: దేవి నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని శ్రీ దుర్గా మల్లేశ్వరి ఆలయ ఉత్సవ కమిటీ నిర్ణయించింది. ఆదివారం అల్లాపూర్‌ డివిజన్‌ పర్వత్‌నగర్‌ చౌరస్తాలోని శ్రీ దుర్గా మల్లేశ్వరి ఆలయ ఆవరణలో ఉత్సవ కమిటీ సమావేశం జరిగింది. ముందుగానే విగ్రహదాత, అన్నదాతలు ముందుకు వచ్చి రూ.3.50 లక్షలను విరాళంగా అందించటం అభినందనీయమన్నారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే దేవి నవరాత్రి ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని కోరారు.

## మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌గా సుధాకర్‌రెడ్డి


సుధాకర్‌రెడ్డి

మోతీనగర్‌: మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌కు చెందిన మాచిరెడ్డి సుధాకర్‌రెడ్డిని కూకట్‌పల్లి వైఎస్‌ఆర్‌ మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మార్కెట్‌ కమిటీ డైరెక్టర్‌గా నియమించినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్‌, బీసీ కమిషన్‌ చైర్మన్‌ గోపిశెట్టి నిరంజన్‌, బీ బ్లాక్‌ మాజీ అధ్యక్షులు గోపిశెట్టి రాఘవేందర్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రాబోయే రోజుల్లో పార్టీ పటిష్టత కోసం మరింత కృషి చేస్తానన్నారు.

## భరత్‌ నగర్‌లో ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న స్థానికులు

కూకట్‌పల్లి: హెల్పింగ్‌ హ్యూమన్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో భరత్‌నగర్‌ కాలనీలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరంలో ఫిజియోథెరపి, డయాబెటిస్‌, కళ్ల సంబంధిత వ్యాధుల నిర్ధారణ కోసం ఉచితంగా చికిత్స అందజేశారు. అదే విధంగా బ్లడ్‌ డొనేషన్‌ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్‌ హ్యూమన్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ మగ్బూల్‌ మట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించేందుకు క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


## ప్రధాని మోదీ పాలనలో దేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ స్థాయికి

మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌

కుత్బుల్లాపూర్‌: ప్రపంచంలో అత్యధిక సభ్యత్వాలు కలిగిన పార్టీ బీజేపీ అని, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో భారతదేశ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ స్థాయికి చేరాయని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ అన్నారు. ఆదివారం జీడిమెట్ల డివిజన్‌లో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌ పలువురికి బీజేపీ సభ్యత్వాలు అందజేసి మాట్లాడారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్‌ నియోజకవర్గంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని తీర్చడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 77 సంవత్సరాలైనా విద్య, వైద్య సమస్యలు నెలకొన్నాయని, ఎంతో మందికి ఉండటానికి ఇల్లు కూడా లేవన్నారు. ప్రధాని నరేంద్రమోదీ వచ్చిన తర్వాత కొన్ని రంగాల్లో గణనీయమైన మార్పు వచ్చిందని, నేడు ప్రపంచంలో దేశానికి గుర్తింపు లభిస్తోందన్నారు. విశ్వకర్మ లాంటి అనేక రకాల స్కీములను దేశంలో తీసుకువచ్చి పేదరికం పోగొట్టేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని, బీజేపీ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి ఇంటింటికీ తిరిగి కార్యకర్తలు, నాయకులు రికార్డు స్థాయిలో సభ్యత్వాలను నమోదు చేయాలని కోరారు. జిల్లా కన్వీనర్‌ మల్లారెడ్డి, జిల్లా జనరల్‌ సెక్రెటరీ గిరివర్ధన్‌, జీడిమెట్ల డివిజన్‌ కార్పొరేటర్‌ తారా చంద్రారెడ్డి, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కట్ట కుమార్‌, వాసు, రాజేశ్వర్‌ చారి, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

## బస్సులో లైంగిక దాడికి పాల్పడ్డ క్లీనర్‌ అరెస్ట్‌

మూసాపేట: ఓ ప్రైవేట్‌ ట్రావెల్‌ బస్సులో ప్రయాణిస్తున్న వివాహిత మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డ క్లీనర్‌ రెడ్డి సాయికుమార్‌ను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. కూకట్‌పల్లి పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం సామర్లకోటకు చెందిన ఓ మహిళ (26) హైదరాబాద్‌లోని హిమాయత్‌ సాగర్‌ రోడ్డులో గల కిస్మత్‌పూర్‌లోని ఓ ఇంట్లో కేర్‌ టేకర్‌గా పని చేస్తున్నది. స్వగ్రామం వెళ్లడానికి 18వ తేదీన ఓ ప్రైవేట్‌ ట్రావెల్‌ బస్సు(స్లీపర్‌ కోచ్‌) బుక్‌ చేసుకుంది. కూకట్‌పల్లిలోని వై జంక్షన్‌ వద్ద రాత్రి 10.40 గంటలకు బస్సు ఎక్కింది. సిటీ దాటిన తరువాత బస్సులో అందరూ నిద్రకు ఉపక్రమించారు. ఈ సమయంలో బస్సు క్లీనర్‌(హెల్పర్‌) రెడ్డి సాయికుమార్‌ (29) స్లీపర్‌లో ఒంటరిగా ఉన్న ఆ మహిళను బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె ఇంటికి వెళ్లాక విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. దీంతో ఆమెను తీసుకొని కుటుంబ సభ్యులు శనివారం యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. వారు కేసును కూకట్‌పల్లి స్టేషన్‌కు బదిలీ చేయడంతో పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.


టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగంను మర్యాదపూర్వకంగా కలిసిన వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ ప్రకాష్‌, డైరెక్టర్లు నరసింహ యాదవ్‌, సయ్యద్‌ అయిజాజ్‌ అలీ –కూకట్‌పల్లి